క్లుప్తంగా

అంబలి పంపిణీ


అంబలి పంపిణీ చేస్తున్న నాయకులు

యాలాల: మండల కేంద్రం చావిడీలో మాజీ సర్పంచ్ పేరి నారాయణరెడ్డి జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన చలివేంద్రంలో సోమవారం తైద అంబలిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడారు. మండుటెండలో బాటసారులకు అంబలి ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగయ్య, చిన్న, అశోక్ నాయీ, బుర్నపురి నర్సింహులు, లాలప్ప, శేఖర్ తదితరులు ఉన్నారు.

వీధి నాటకం ప్రారంభం


కళాకారుల ప్రదర్శన

యాలాల: మండల పరిధి ముద్దాయిపేటలో ఆదివారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి మహత్యం వీధి నాటక ప్రదర్శన ప్రారంభించారు. తొలి రోజు విష్ణుమూర్తి, లక్ష్మీదేవి వైకుంఠం నుంచి భూలోకానికి రావడం నుంచి మొదలు పెట్టారు. విఘ్నేశ్వరుడు, విష్ణుమూర్తి, లక్ష్మీదేవి, మాసిరెడ్డి, యమధర్మరాజు పాత్రల్లో కళాకారులు ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. నాటక ప్రదర్శన ఈ నెల 13వ తేది వరకు రోజు విడిచి రోజు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

గౌరవ వేతనాల్లో అవకతవకలు


అక్బర్‌బాబ

యాలాల: ప్రజాప్రతినిధులకు అందజేసే గౌరవ వేతనాల్లో అవకతవకలు జరిగాయని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ మేరకు జిల్లాలోని ఎంపీటీసీలు, కోఆప్షన్ సభ్యుల గౌరవ వేతనాల వివరాలను జిల్లా పరిషత్ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యుల ఎన్నిక నాటి నుంచి నేటి వరకు ఎన్ని నెలల వేతనాలు విడుదల చేశారో తెలపాలన్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, జిల్లా మంత్రులు దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

క్రీడా పోటీలు నేడు

బొంరాస్‌పేట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని యువత ఆటపాటలకు సిద్ధమయ్యారు. బొంరాస్‌పేట, దుద్యాల మండల పరిధి గ్రామాలు, గిరిజనతండాల్లో పలురకాల క్రీడా పోటీలు నిర్వహించేందుకు సన్నాహాలు చేశారు. రేగడిమైలారంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్, నాగిరెడ్డిపల్లి, చౌదర్‌పల్లి గ్రామాల్లో వాలీబాల్, బొట్లోనితండాలో సేవాలాల్ మహరాజ్ సంఘం ఆధ్వర్యంలో క్రికెట్, సూర్యానాయక్ తండా, కాకర్లగండితండా కబడ్డీ, క్రికెట్, దుద్యాల మండలం ఈర్లపల్లి, దుద్యాల, హకీంపేట గ్రామాల్లో రకరకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు శేరిసాయిలు, బంటుకాశప్ప, నరేశ్, రఘుపతిరాజు, నెహ్రూనాయక్ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చేవెళ్ల: ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సురేశ్‌బాబు కోరారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో వ్యవసాయ మార్కెట్ గోదాం వద్ద వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీఎంఎస్ గోదాం ఇన్‌చార్జి శివారెడ్డి, ఏఈఓలు రమ్య, సుశీలతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

చేవెళ్ల: ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో ఏదైనా సాధించేందుకు అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పట్నం మహేందర్‌రెడ్డి వైద్య కళాశాల డీన్ డాక్టర్ పి.వి.సత్యనారాయణ సూచించారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని పట్నం మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో 2024 ప్రపంచ ఆరోగ్య సంస్థ 76వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా నా ఆరోగ్యం, నా హక్కు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం థీమ్‌గా తీసుకొని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాలతో పాటు ఆలూరు ప్రాథమిక వైద్య కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు పట్నం జనరల్ ఆస్పత్రి అందుబాటులో ఉందన్నారు.


సర్వభూపాల వాహనంపై శ్రీవారు

ఘనంగా బ్రహ్మోత్సవాలు

మోహినీ అవతారంలో శ్రీవారు

కొడంగల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా తిరుమల తరహాలో ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం ఉదయం శ్రీవారు మోహినీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి స్వామివారు సర్వ భూపాల వాహనంపై భక్తులకు కనువిందు చేశారు.

ఉత్సవాల్లో ప్రధాన ఘట్టం

బాలాజీనగర్‌లో వెలసిన కలియుగ వైకుంఠ దైవం.. కొడంగల్ ప్రాంత ప్రజల ఇలవేల్పుగా ఉన్న వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం గరుడ వాహనంపై శ్రీవారి ఊరేగింపు. సోమవారం రాత్రి 10 గంటలకు భూదేవి శ్రీదేవి సమేతంగా శ్రీవారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఊరేగింపు జాతర స్థలం వరకు కొనసాగింది.


విశేష అలంకరణలో ఉత్సవమూర్తులు

వైభవంగా లంకాదహనం

సోమవారం అర్ధరాత్రి ఒంటి గంటకు (మంగళవారం తెల్లవారుజామున) వేంకటేశ్వరస్వామి జాతర స్థలంలో లంకా దహన కార్యక్రమం వైభవంగా జరిగింది. అద్భుతం భక్తుల ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. మూఢ నమ్మకాలను పారదోలుతూ మత విశ్వాసాలను పెంపొందించే విధంగా సాగిన కార్యక్రమం భక్తులను అలరించింది. ఈ సందర్భంగా చెన్నై నుంచి ప్రత్యేకంగా తెప్పించిన రకరాల టపాసులను జాతర స్థలంలో కాల్చారు.


మోహినీ అవతారంలో స్వామివారు

కంకర రోడ్లు.. తప్పని పాట్లు

- అధ్వానంగా ఎన్కెపల్లి లింకురోడ్డు
- అవస్థలు పడుతున్న వాహనదారులు
- కాలినడకన వెళ్లలేని దుస్థితి

బంట్వారం: కంకర తేలిన లింకు రోడ్లతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కోట్‌పల్లి మండల పరిధి ఎన్కెపల్లి లింకు రోడ్డు అధ్వానంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో మాకొద్దూ ఈ నరక ప్రయాణం అంటూ.. వాహన చోదకులు మరో దారిలో గమ్యం చేరుకుంటున్నారు. ప్రస్తుత లింకు రోడ్డు.. జిన్నారం గేటు నుంచి ఎన్కెపల్లి మీదుగా బంట్వారం, తొర్మామిడి, కర్ణాటకలోని కుంచారం వెళ్లే వారికి చాలా సౌకర్యంగా ఉండేది. ప్రస్తుతం రోడ్డు బాగా లేకపోవడంతో దూరభారం అయినా.. ప్రత్యామ్నాయం ఎంచుకుంటున్నారు.

ఎనిమిదేళ్ల క్రితం సగం..

కంకర తేలిన ఈ లింకు రోడ్డుకు ఎనిమిదేళ్ల కిందట సగం వరకే మెటలింగ్ పనులకు నిధులు మంజూరయ్యాయి. దీంతో బడ్జెట్ ఉన్నంత మేరకే పనులు చేశారు. మిగతా పనులు మెటలింగ్‌కు నోచుకోక పెండింగ్‌లో ఉండిపోయాయి. నాడు చేసిన పనులు కూడా మళ్లీ మొదటికొచ్చాయి. ప్రసుత్తం కంకర తేలి కాలి నడకన వెళ్లలేని దుస్థితి నెలకొంది.


ఎన్కెపల్లి లింకు రోడ్డు దుస్థితి

అత్యవసర సమయంలో అంబులెన్స్ ఎన్కెపల్లికి సకాలంలో చేరుకోవడం లేదని, చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని గ్రామస్తులు తెలిపారు. ఎన్నాళ్లీ కంకర రోడ్డు కష్టాలు అని, ప్రయాణం కష్టంగా ఉందని వాపోతున్నారు. సమస్యను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీరాజ్ అధికారులు సత్వరమే స్పందించి, రోడ్డు మరమ్మతుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు



ఎన్కెపల్లి లింకు రోడ్డు సమస్య చాలా కాలంగా అలాగే ఉంది. కంకర తేలి ఉండటంతో కాలినడకన కూడా వెళ్లలేని దుస్థితి. ప్రయాణం కష్టంగా మారింది. ద్విచక్రవాహనాలపై వెళ్లేవారు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డును మరమ్మతు చేయిస్తే చాలా సౌకర్యంగా ఉంటుంది. అధికారులు తగిన చర్యలు తీసుకొని, మెటలింగ్‌తో పాటు బీటీరోడ్డు నిర్మాణం చేపట్టాలి.

– లక్ష్మయ్య, ఎన్కెపల్లి

ప్రతిపాదనలు పంపిస్తాం

మెటలింగ్‌తో పాటు, బీటీరోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. ఎన్కెపల్లి పంచాయతీ నుంచి తీర్మానం చేయాలి. త్వరలోనే రోడ్డును పరిశీలిస్తాం. రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు తీసుకుంటాం. – జితేందర్, డీఈ, పీఆర్


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

పూడూరు: అధికార పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నమ్మి, ఇతర పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్ తెలిపారు. సోమవారం బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ పీఏసీఎస్ చైర్మన్ నర్సింహారెడ్డి, నాయకులు అనంతరాములు, అన్వర్ తదితరులు పరిగిలో నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు వేం నరేందర్‌రెడ్డి సమక్షంలో హస్తం కండువా కప్పుకున్నారని సురేందర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, కడుమూరు ఆనందం, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, తాజొద్దీన్ పాల్గొన్నారు.


క్రోధి తెలుగు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని కొనుగోలు దారులతో పూజా సామగ్రి దుకాణాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా శనివారం వికారాబాద్‌లో ఉగాది పచ్చడి తయారీ కోసం కుండలు కొనుగోలు చేస్తున్న ప్రజలు - అనంతగిరి

సాగులో మెలకువలు పాటించండి

ఏఓ నిషాంత్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: వరి సాగులో రైతులు మెలకువలను పాటించి, అధిక దిగుబడి పొందాలని మండల వ్యవసాయ అధికారి(ఏఓ) నిషాంత్‌కుమార్ అన్నారు. రంగారెడ్డి జిల్లా ఫరూఖ్‌నగర్ మండల పరిధి కొండన్నగూడ, మేళ్లగూడ, వెంకన్నగూడ గ్రామాల్లో సోమవారం ఏఓ పర్యటించారు. వరి సాగును పరిశీలించారు. వరిలో కాండం తొలిచే పురుగులను గుర్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాండం తొలిచే పురుగు వ్యాపించడంతో వరి పొట్ట దశలోనే వరి కంకులు, తాలు గింజలు ఏర్పడతాయని, దీంతో దిగుబడి తగ్గుతుందన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్, హైడ్రోక్లోరైడ్ గుళికలను ఎకరాకు కిలో చొప్పున వరినాట్లు వేసే సమయంలో చల్లాలని సూచించారు. వరి పంటను కీటకాల నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని కోరారు.

నివారణకు చర్యలు

మొయినాబాద్: వరిలో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రాగమ్మ తెలిపారు. స్థానిక రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో కాండం కుళ్లు తెగులు, అగ్గితెగులు, కాండం తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉందన్నారు. కాండం కుళ్లు తెగులు నివారణకు ఒక లీటరు నీటికి ప్రోపికొనజోల్ 1 మిల్లీ లీటర్ లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్ల చొప్పున మందును కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అగ్గితెగులు నివారణకు


షాద్‌నగర్‌రూరల్: వరి పైరును పరిశీలిస్తున్న ఏఓ తదితరులు

ట్రైసైక్లోజోల్ 0.6 మిల్లీ లీటర్ లేదా ఐసోప్రొథైయోలిన్ 1.5 మిల్లీ లీటర్లు లేదా కాసుగొమైసిన్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. తెగులు నివారణకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలను ఎకరాకు 10 కిలోల చొప్పున వేసుకోవాలన్నారు. వరి పొట్ట దశలో లీటరు నీటికి క్లోరాంట్రనిలిప్రోల్ 0.3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు. వరిచేను గట్లపై కలుపు మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు నివారించుకోవాలని చెప్పారు. వరిపంట దుబ్బ చేసే దశ నుంచి అంకురం దశ వరకు పొలంలో 2 సెంటీ మీటర్ల నీరు నిలువ ఉండాలని వెల్లడించారు. అంకురం దశ నుంచి పూత దశ వరకు నీటి లభ్యతను బట్టి పొలంలో 2 సెంటీ మీటర్ల నుంచి 5 సెంటీ మీటర్ల వరకు నిలువ ఉంచుకోవాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతిలో నీటి తడులు ఇవ్వాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి ఈ చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

షాద్‌నగర్‌రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీఓ బన్సిలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనునాయక్ మాట్లాడుతూ.. కూలీలకు పెండింగ్‌లో ఉన్న 9 నెలల బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పని ప్రదేశంలో ఫొటో తీసే విధానాన్ని రద్దు చేయాలని, కొలతలు లేకుండా రోజుకు రూ.800 కూలీ ఇవ్వాలని పేర్కొన్నారు. పని ప్రదేశంలో నేల గట్టిగా ఉంటే తేలిక పాటి పనులను కల్పించాలన్నారు. నాయకులు రాజు, ఎల్లయ్య, లింగమ్మ, పవన్ పాల్గొన్నారు.

అద్దెకు గోదాములు

సీఈఓ రాజమౌళి


తట్టెపల్లి గోదాం

పెద్దేముల్: తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నాబార్డు నిధులతో నిర్మించిన గోదాంలను అద్దెకు ఇవ్వనున్నట్లు సీఈఓ రాజమౌళి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి తట్టెపల్లిలో 1,000 మెట్రిక్ టన్నులు, నాగులపల్లిలో 500 మెట్రిక్ టన్నుల గోదాంలను ఐదు నెలల క్రితం నిర్మించామని, ఆసక్తి గల వ్యాపారులు, రైతులకు రైస్ మిల్ లేదా దాల్ మిల్ కోసం అద్దెకు ఇస్తామని వెల్లడించారు. తట్టెపల్లిలో ఫంక్షన్ హాల్‌కు ఇస్తామని పేర్కొన్నారు. అవసరం ఉన్నవారు తట్టెపల్లి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

నియామకం

చేవెళ్ల: ముదిరాజ్ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోషియేషన్(ఎంఈపీఏ) జిల్లా ప్రధాన కార్యదర్శిగా చామంతి కృష్ణముదిరాజ్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మెపా(ఎంఈపీఏ) కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి బి.సంజీవన్‌కుమార్, గౌరవాధ్యక్షుడు డాక్టర్ బోయిని జగన్‌మోహన్‌ల ఆధ్వర్యంలో మల్కాపూర్ గ్రామానికి చెందిన కృష్ణముదిరాజ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కృష్ణ మాట్లాడారు. ముదిరాజ్‌ల అభివృద్ధి, ఐక్యత కోసం అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తానని చెప్పారు. పూర్తిస్థాయిలో మెపా కార్యక్రమాల్లో పాల్గొంటూ సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి సురేందర్‌రెడ్డి

షాబాద్: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందులని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని నాగర్‌గూడ పీఎస్ఆర్ గార్డెన్, తిర్మలాపూర్ దర్గాల్లో మైనార్టీలకు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్ర రంజాన్ మాసంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు కార్యక్రమాలు ఐకమత్యానికి, మత సామరస్యానికి చిహ్నంగా నిలుస్తాయన్నారు. సర్వమత సారం ఒక్కటేనని, మానవులంతా సోదరభావంతో ఉండాలని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. మైనార్టీలకు అండగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా అభివృద్ధి పథకాలు ప్రారంభించిందని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాంరెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, మల్లేశ్, నాయకులు భార్గవ్‌రాం, రవీందర్, అక్తర్‌పాషా, శేఖర్, శ్రీరాంరెడ్డి, రాహుల్‌గుప్తా, చెన్నయ్య, వెంకట్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, యాదగిరి, పామెన నర్సింలు, సత్యం, భందయ్య, గడ్డం చంద్రయ్య తదితరులు ఉన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న సురేందర్‌రెడ్డి, ముస్లింలు

నిలిచిన తైబజార్ వేలం

- మున్సిపాలిటీ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు: మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం ఏటా ఆయా రకాల పథకాల నుంచి నిధులను మంజూరు చేస్తుంది. ఇలా ప్రభుత్వం నుంచి వచ్చే నిధులే కాకుండా పంచాయతీలు, మున్సిపాలిటీలు తమ పరిధిలో ఉన్న ఇళ్లు, వ్యాపార సముదాయాలు, తైబజార్‌తో పాటు పలు మార్గాల ద్వారా సొంతంగా నిధులు సమీకరించుకోవాలని ఉన్నతాధికారులు ఆయా సమావేశాల్లో అధికారులకు దిశానిర్దేశం చేస్తుంటారు. సొంతంగా ఆదాయ వనరులను సృష్టించుకుంటే కొంత వరకు పాలనలో మున్సిపాలిటీలు, పంచాయతీలకు ఆర్థికభారం తగ్గుతుంది. అవకాశం ఉన్నా ఆయా కారణాల సాకుతో కొన్ని మున్సిపాలిటీలు, మేజర్ పంచాయతీల అధికారులు, పాలకవర్గం ఆదాయ మార్గాలను సృష్టించుకోవడంపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. దీంతో కేవలం పన్నులు, ప్రభుత్వం ఇచ్చే నిధులపైనే ఆధారపడాల్సి వస్తోంది.

ఆసక్తి చూపని గుత్తేదారులు

కొత్తూరు మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడే తైబజార్ వేలం ప్రక్రియను ప్రారంభించారు. ఈ క్రమంలో మూడేళ్ల క్రితం కొత్తూరు మున్సిపాలిటీగా మారింది. మున్సిపాలిటీ ఏర్పాటయ్యాక మొదటి సంవత్సరం తైబజార్ వేలం నిర్వహించగా పదుల సంఖ్యలో టెండర్ నిర్వాహకులు పాల్గొన్నారు.


కొత్తూరు మున్సిపాలిటీ కార్యాలయం

అప్పట్లో ఏడాదికి గాను తైబజార్ వేలంను ఓ గుత్తేదారు రూ.5లక్షలకు దక్కించుకున్నారు. కాగా సదరు టెండర్ నిర్వాహకుడు మున్సిపాలిటీ పరిధిలోని ఆయా పరిశ్రమలకు వచ్చే లారీలు, రోడ్లపై నిలిపే వాహనాల వద్ద తైబజార్ రసీదు ఇచ్చి డబ్బులు వసూలు చేశారు. దీనిపై గుత్తేదారుకు, అధికారులు, పరిశ్రమల నిర్వాహకుల మధ్య ఇబ్బందులు ఎదురయ్యాయి. చివరగా పరిశ్రమలకు వచ్చే లారీలు, రోడ్లపై నిలిపే వాహనాలకు తైబజార్ వర్తించదనే నిబంధన పెట్టారు. పెద్ద మొత్తంలో లారీలు, వాహనాల నుంచే టెండర్‌దార్లకు ఆదాయం వస్తుండడం ఆ నిబంధన కారణంగా నిలిచిపోయింది. దానికి మున్సిపాలిటీ పాలకవర్గం తైబజార్ వేలం టెండర్ సర్కారు పాట రూ.5.01లక్షలకు నిర్ణయించింది. కాగా వేలంలో టెండర్ దక్కించుకున్న పెద్దగా ఆదాయం రాదనే కారణంతో గుత్తేదారులు వేలం ప్రక్రియకు ఆసక్తి చూపడం లేదు. చివరగా మున్సిపల్ అధికారులు సర్కారువారి పాట మేరకు వేలం నిర్వహించగా అందులో పాల్గొన్న గుత్తేదారులు సర్కారు వారి పాట కంటే తక్కువ పాడారు. దీంతో అధికారులు రెండేళ్ల నుంచి తైబజార్ వేలం ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు.

పాలకవర్గంతో చర్చిస్తాం



మున్సిపాలిటీలో రెండేళ్ల నుంచి తైబజార్ వేలం ప్రక్రియ నిలిచిపోయింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో మున్సిపల్ పాలకవర్గం సమావేశాన్ని నిర్వహించడం కుదరదు. జూన్ తర్వాత సమావేశాన్ని ఏర్పాటు చేసి సభ్యుల సూచనతో వేలంపై నిర్ణయం తీసుకుంటాం.

– ఎస్.బాలాజీ, మున్సిపల్ కమిషనర్, కొత్తూరు

పేరుగొప్ప.. ఊరుదిబ్బ


తాండూరు రూరల్: రోడ్డుపక్కన పేరుకుపోయిన మురుగు

- మేజర్ గ్రామ పంచాయతీలో డ్రైనేజీ అస్తవ్యస్తం
- మురుగు కాల్వలు నిర్మించి, పారిశుద్ధ్యం మెరుగుపర్చాలన్న గ్రామస్తులు

తాండూరు రూరల్: పేరుగొప్ప ఊరుదిబ్బలా ఉంది మేజర్ గ్రామ పచాయతీ కరన్‌కోట్ దుస్థితి. పేరుకు పెద్ద పంచాయతే అయినా.. కనీసం డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో మురుగు జలాలు ముందుకు సాగక.. స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సుమారు 10 వేలకు పైగా జనాభా కలిగిన కరన్‌కోట్ గ్రామంలోని పలు వీధుల నుంచి పారే వ్యర్థ జలాలు ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఇదే మార్గంలో తాగునీటి పైప్‌లైన్ కూడా ఉంది. పైప్‌లైన్ లీకైతే.. మురుగు నీరు కలిసే అవకాశం ఉందని, ఈ మార్గంలో మురుగుకాల్వలు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రాకొండలో..

దోమ: గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపంతో మురుగు కాల్వలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది. మండల పరిధి రాకొండ గ్రామంలో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. మురుగు కాలువల్లో చెత్త చెదారం పేరుకుపోయి, ముందుకు సాగని దుస్థితి నెలకొంది. దీంతో దుర్వాసనతో పాటు, దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని స్థానికులు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య నిర్వహణలోపం లేకుండా చూడాలని కోరుతున్నారు.